క్లుప్తంగా

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న గోవింద్ నరేష్

నల్లగొండ టౌన్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోవింద్ నరేష్ అన్నారు. గురువారం నల్లగొండలోని టీఎన్జీఓ భవన్‌లో నిర్వహించిన అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, అసమానతలు లేని సమాజ నిర్మాణానికి ఎమ్మార్పీఎస్ తన ప్రయాణాన్ని కొనసాగిస్తుందన్నారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ పల్లర్ల సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జానకి రామయ్య చౌదరి, బకరం శ్రీనివాస్, మల్లెపాక వెంకన్న, గాదె రమేష్, ఇరిగి సైదులు, కూరపాటి కమలమ్మ, మేడి శంకర్, కందుల మోహన్, శ్రీనివాసులు, రవీందర్, శ్రీనివాస్, చిన్నా, దేవయ్య, వెంకన్న, ఏడుకొండలు, సుదర్శన్, ప్రసాద్, జలందర్, సైదులు, ఎల్లయ్య, గిరి, రాజు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీలకు డీసీసీ పదవి కేటాయించాలి

కేతేపల్లి: నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిని పార్టీ అధిష్టానం ముస్లిం మైనారిటీలకు కేటాయించాలని టీపీసీసీ మైనారిటీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ ఎండీ యూసుఫ్‌జానీ కోరారు. గురువారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 శాతం ముస్లింలు కీలక పాత్ర పోషించారన్నారు. టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గంలో ముస్లింలకు భాగస్వామ్యం కల్పించటంతో పాటు కార్పొరేషన్ పదవుల భర్తీలో సముచిత స్థానం కల్పించాలని కోరారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

నల్లగొండ టౌన్: పట్టణంలో నివాస స్థలాలు లేకుండా జీవనం సాగిస్తున్న నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి కత్ర సైదిరెడ్డి, పట్టణ సహాయ కార్యదర్శి లెనిన్, ఎస్‌కే మదార్, ముండ్ల ముత్యాలు, రామచంద్రరాజు, లక్ష్మయ్య, విజయ, లక్ష్మి, పార్వతమ్మ, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా శిక్షణ శిబిరం



ఉరుమడ్లలో విద్యార్థులకు హాకీ స్టిక్స్, సాక్స్ అందజేస్తున్న నాయకులు

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో గత నెలరోజులుగా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి హాకీ క్రీడా శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా క్రీడాకారులకు గ్రామానికి చెందిన ఏఎంసీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, పల్లపు బుద్ధుడు హాకీ స్టిక్స్, సాక్స్, సీనియర్ హాకీ క్రీడాకారుడు ఉయ్యాల నరేష్ స్నాక్స్ అందజేశారు. కార్యక్రమంలో కోచ్ గంగాపురం రాము, కొండ పరమేష్, ఎలుగు శేఖర్, జనపాల శ్రీను, చెరుకు సైదులు, బండ్ల నరేష్, సుంకరి శేఖర్, జనగాం స్వామి పాల్గొన్నారు.

మహిళ మృతిపై విచారణ

నల్లగొండ: ఇటీవల పానగల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మారెడ్డి శిల్ప మృతిపై పోలీసులు గురువారం విచారణ ప్రారంభించారు. వారం రోజుల క్రితం పానగల్‌లో వాకింగ్ చేస్తుండగా శిల్పను బైక్ ఢీకొనడంతో చికిత్స పొందుతూ ఆదివారం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో మృతి చెందింది. ఆమె మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఇందులో పోలీసు అధికారి ప్రమేయం ఉందని ఆరోపిస్తూ శిల్ప భర్త మారెడ్డి ప్రశాంత్‌రెడ్డి టూటౌన్ సీఐ, ఎస్ఐ, ఎస్పీకి వినతి పత్రం అందజేశాడు. ఈమేరకు విచారణ ప్రారంభించినట్లు టూటౌన్ ఎస్సై సైదులు తెలిపారు.

కులగణన ప్రారంభించాలి

మిర్యాలగూడ టౌన్ : కేంద్ర ప్రభుత్వం 2025లోనే కులగణన ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ బీసీల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమైనట్లు కనిపిస్తుందని ఆరోపించారు. త్వరలో నిర్వహించబోయే తమిళనాడు, బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ అధికారంలోకి రావడానికి బీసీ కులగణన అంశాన్ని తీసుకువచ్చిందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి బీసీలపై ప్రేమ ఉంటే వెంటనే షెడ్యూల్‌ను సవరించి ఈ సంవత్సరంలోనే ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నేతలు బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, సుధాకర్, శేఖర్ తదితరులున్నారు.

మహా కుంభాభిషేకం ప్రారంభం



పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద కంచర్ల కృష్ణారెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు

- వైభవంగా రామలింగేశ్వర స్వామి ఆలయ ఉత్సవాలు
- నేడు మండప పూజ, రేపు బొడ్రాయికి అభిషేకం
- ఆదివారం శిఖర కలశస్థాపన, రామలింగేశ్వరస్వామి కల్యాణం

చిట్యాల: చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో గల శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో మహాగణపతిపూజ, స్వస్తి పుణ్యావాచనం, అఖండ దీపారాధన, రక్షా బంధనం, గోపూజ, యాగశాల ప్రవేశం, మండపారాధన, మంత్ర పుష్పం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ దాతలు కంచర్ల కృష్ణారెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి ఆలయంలో అభిషేకాలు జరిపించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండప పూజ, మూలమంత్ర జపం, తీర్థ ప్రసాద వితరణ, శనివారం గ్రామంలోని బొడ్రాయికి అభిషేకం, ఆదివారం మండప పూజ, శిఖర కలశస్థాపన, శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణం, పూర్ణాహుతి, హోమం నిర్వహించనున్నారు. అదేవిధంగా గ్రామంలో రేణుక ఎల్లమ్మకు బోనాలు సమర్పించనున్నారు.

జయేంద్ర సరస్వతి ప్రారంభించిన ఆలయం

ఉరుమడ్ల గ్రామంలో సుమారు రూ.2కోట్లతో నిర్మించిన ఈ ఆలయాన్ని 2010 జూన్‌లో అప్పటి కంచికామకోటి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి, విజయేంద్ర సరస్వతి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో సినీనటుడు బాలకృష్ణ, 2016లో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఎందరో ప్రముఖులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతియేటా శివరాత్రి, బోనాల పండుగల సమయాల్లో ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు, వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జరగనున్న ఉత్సవాలకు మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు రానున్నారు.

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తికి ఆహ్వానం

నార్కట్‌పల్లి : చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో జరిగే మహా కుంభాభిషేకానికి హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి గురువారం మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను కోరారు. ఈమేరకు ఆహ్వానపత్రిక అందజేశారు. పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి కేటీఆర్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఆయన వెంట నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాణాల అశోక్‌రెడ్డి, చిరుమర్తి మనోజ్‌కుమార్ ఉన్నారు.



చిరుమర్తి లింగయ్యకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సీకేడీ రోగికి ఆధునిక ప్రమాణాలతో శస్త్రచికిత్స



మాట్లాడుతున్న యశోధ ఆసుపత్రి వైద్యులు

నల్లగొండ టౌన్: దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి (సీకేడీ)తో బాధపడుతూ మరణం అంచున ఉన్న నల్లగొండ పట్టణానికి చెందిన గుజ్జుల జనార్దన్‌రెడ్డికి అత్యాధునిక ప్రమాణాలతో కూడిన శస్త్ర చికిత్స అందించి ప్రాణాలు కాపాడినట్లు మలక్‌పేట యశోధ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ చేతన్ వీరమనేని, కార్డియాలజిస్టు డాక్టర్ బి.వెంకట్‌రెడ్డి, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ గుత్తా శశిధర్‌రెడ్డి గురువారం తెలిపారు. జనార్దన్‌రెడ్డి (56) శ్వాస సమస్య, కాళ్ల వాపు, మూత్ర పిండాల క్షీణతతో బాధపడుతుండగా నల్లగొండలోని ఆస్పత్రిలో చికిత్స పొందారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం యశోధ ఆస్పత్రిలో చేరగా మెరుగైన చికిత్స అందించినట్లు తెలిపారు. సమావేశంలో ఆస్పత్రి డైరెక్టర్ ఓరుకంటి పవన్, యూనిట్ హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, జీఎం శ్రీనివాస్, వాసు కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లగొండలో వేదాంత్ హైస్కూల్ ప్రారంభం



జ్యోతి వెలిగిస్తున్న డీఈఓ భిక్షపతి చిత్రంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ: నల్లగొండలో వేదాంత్ హైస్కూల్‌ను డీఈఓ భిక్షపతి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేదాంత్ పాఠశాలకు ప్రభుత్వ అనుమతి లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, స్కూల్ ప్రెసిడెంట్ సోమగాని శంకర్‌గౌడ్, ప్రిన్సిపాల్ శోభన్, డైరెక్టర్లు శ్యాంప్రసాద్, గోపాల్‌రెడ్డి, ఆదిత్యసామ్రాట్, భరణ్, అబ్బగోని రమేష్‌గౌడ్, కేసానివేణుగోపాల్‌రెడ్డి, సాయిశ్రీ సందీప్‌గౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



తిప్పర్తిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ పరుశురాం

కట్టంగూర్ : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ఫ్రాంక్లిన్ ఆల్‌బర్ట్ అన్నారు. గురువారం కట్టంగూర్ మండలంలోని పందెనపల్లి, ఎరసానిగూడెం గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పందెనపల్లిలో గ్రామంలో 73 దరఖాస్తులు, ఇస్మాయిల్‌పల్లిలో 59 దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

తిప్పర్తి: రెవెన్యూ సదస్సుల్లో భాగంగా గురువారం తిప్పర్తి మండల కేంద్రంతోపాటు, కేశరాజుపల్లి గ్రామంలో గురువారం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ పరుశురాం తెలిపారు. తిప్పర్తిలో 113, కేశరాజుపల్లిలో 15 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఆర్ఐ ద్రోణార్జున తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నార్కట్‌పల్లి : రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వరరావు కోరారు. గురువారం నార్కట్‌పల్లి మండలంలోని షాపల్లి, నార్కట్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 80 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐలు తరుణ్, భవాని, సర్వేయర్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ జాల వెంకటయ్య తదితరులున్నారు.

137 దరఖాస్తుల స్వీకరణ

కేతేపల్లి: మండలంలోని బండపాలెం, బొప్పారం గ్రామాల్లో గురువారం అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా భూసమస్యలపై బండపాలె గ్రామంలో 74, బొప్పారం గ్రామంలో 63 దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎంఏ సత్తార్ తెలిపారు.

చండూరు: మండలంలోని ఇడికూడ, కస్తాల గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇడికూడ గ్రామంలో 23 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ కిరణ్మయి తెలిపారు. కస్తాల గ్రామంలో 19 దరఖాస్తులు వచ్చాయని డిప్యూటీ తహసీల్దార్ నిర్మల పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మురళీకృష్ణ, శేఖర్, సిబ్బంది శైలజ, లింగస్వామి పాల్గొన్నారు.

మర్రిగూడ: మండలంలోని తిరగండ్లపల్లి, దామెర భీమనపల్లి గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తిరగండ్లపల్లి గ్రామంలో 44, దామెరబీమనపల్లి గ్రామంలో 137 దరఖాస్తులు రైతుల నుంచి స్వీకరించచినట్లు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీను నాయక్, ఆర్ఐలు పాండురంగారెడ్డి, జహీరొద్దీన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి

మర్రిగూడ: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కాశిరెడ్డి కృష్ణారెడ్డి కోరారు. టీఎస్‌యుటీఎఫ్ చేపట్టిన ప్రచార జాతా గురువారం మర్రిగూడ మండల కేంద్రానికి చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు నాగవరం శ్రీనివాస్‌రావు, పున్నా కృష్ణయ్య, బండారు గోవర్ధన్, రజియొద్దీన్, అశోక్, కరీం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

చిట్యాల: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఏశమల్ల నాగయ్య కోరారు. చిట్యాల మండలంలోని వెంకటాపురం, నేరడ, ఉరుమడ్ల, వనిపాకల, వట్టిమర్తి గ్రామాల్లో గురువారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార జాతా కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం మాజీ అధ్యక్షుడు యాదయ్య, ఉపాధ్యక్షురాలు జానకి, రామలింగయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ప్రతిఏటా ఒకే పంట సాగు చేయొద్దు

మునుగోడు: రైతులు ప్రతి ఏటా ఒకే పంట సాగు చేయకుండా పంట మార్పిడి చేసుకోవాలని మునుగోడు మండల వ్యవసాయ అధికారి పద్మజ అన్నారు. గురువారం మునుగోడు మండలంలోని పలివెల గ్రామంలో రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పించారు. పంట మార్పిడి చేస్తే భూసారం పెరగడంతోపాటు పాటు దిగుబడి అధికంగా వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీలు పొందేందుకు ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఏఈఓ అఖిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలి

మునుగోడు: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు కల్పించాలని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ కోరారు. గురువారం మునుగోడు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట అందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం వికలాంగులకు రూ. 6వేల పింఛన్ అందించాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలుచేసే వరకూ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుడిపల్లి సుమతి, చిన్నపాక మత్స్యగిరి, అలివేలు, రేణుక, శ్రీకాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరుకున్న పాఠ్యపుస్తకాలు



ఎమ్మార్సీలో భద్రపరిచిన పాఠ్యపుస్తకాలు

తిప్పర్తి: విద్యా సంవత్సరం ప్రారంభం కానుండటంతో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. విద్యార్థులకు అవసరం ఉన్న పాఠ్యపుస్తకాలు ఎమ్మార్సీకి చేరుకున్నాయి. తిప్పర్తి మండలంలో మొత్తం 45పాఠశాలలకు గాను 2800మంది విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్యపుస్తకాలు సిద్ధం చేసినట్లు మండల విద్యాధికారి నర్సింహానాయక్ తెలిపారు. ఇప్పటివరకు 60శాతం పుస్తకాలు వచ్చాయని, మిగిలిన పుస్తకాలు కూడా త్వరలో వస్తాయని పేర్కొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



నల్లగొండ: గ్రీన్ ర్యాలీ నిర్వహిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, వాకర్స్, విద్యార్థులు

నల్లగొండ: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నల్లగొండలోని నాగార్జున డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, వాకర్స్, విద్యార్థులు గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ వెంకన్న, శంకర్‌బాబు, పురుషోత్తంరెడ్డి, డాక్టర్ పుల్లారావు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని రైల్వేస్టేషన్ పార్క్‌లో గురువారం వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ యోగా గురూజీ రాపోలు వెంకటేశ్వర్లు ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పర్వతాలు, ఉపాధ్యక్షుడు రామ్మూర్తి, కార్యదర్శి కృష్ణ భుజంగరావు, గౌరవ అధ్యక్షుడు వీరయ్య, సైదులు, శేఖర్, నరసింహారావు, రమేష్, రామచంద్రయ్య, అంజయ్య, లక్ష్మి, జయప్రద, మధుసూదన్, బాలు నాయక్, వెంకటేశ్వర్లు, సింగం ప్రవీణ్, కేబీ ప్రసాద్, రమేష్, కనకయ్య, రవీందర్ రెడ్డి, యాలాద్రి, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని గ్రీన్ సోషల్ సర్వీసెస్ సొసైటీ చైర్మన్ ఏనుగుల శంకర్‌రెడ్డి అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గురువారం నల్లగొండ పట్టణంలోని మర్రిగూడలో జీవీఆర్ గెలాక్సీ స్కూల్ దగ్గర మొక్కలు నాటారు. అదేవిధంగా చర్లపల్లిలోని అనేశ్వరమ్మ గుట్ట దగ్గర పదివేల చింత, రాగి, మర్రి, అల్లనేరేడు, సీతాఫలం, ఇరికి, వేప ఇతర విత్తనాలను చల్లారు. ఆయన వెంట ఏనుగుల వెంకట్‌రెడ్డి, బొడ్డుపల్లి వెంకటాచారి, విజయలక్ష్మి, కత్తుల హరికృష్ణ, వెంకటేశ్వర్లు, సుదర్శన్, శంకర్, వెంకన్న, అక్షిత్‌రెడ్డి, దినేష్‌రెడ్డిలతో పాటు ఇతర సభ్యులు తదితరులున్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల గ్రామంలో గురువారం కోణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. మానవాళికి, జీవజాతులకు వాతావరణ కాలుష్యం కలిగిస్తున్న ముప్పును పర్యావరణ అవగాహన సదస్సు సంస్థ ప్రతినిధులు, ఫీల్డ్ ఫెసిలిటేటర్లు పరుశురామ్, అంజయ్య వివరించారు. రైతులు వ్యవసాయంలో విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడకంతో పర్యావరణం కలుషితం అవుతుందన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని నివారించటానికి చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అవగాహన సదస్సులో రైతులు వంటెపాక కృష్ణయ్య, యోగేందర్, బొజ్జ వెంకన్న, భిక్షం, లచ్చయ్య, హరీష్, మట్టయ్య, శివ ఉన్నారు.

చిట్యాల: పర్యావరణ దినోత్సవం సందర్భంగా చిట్యాల పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ఉపాధ్యాయులు చిట్యాల మండలంలోని నేరడ గ్రామంలో గురువారం పలు దుకాణాదారులకు ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం శాంభవీమాత ఆలయ ఆవరణలో స్కూల్ ప్రిన్సిపాల్ పెద్ది నరేందర్ మొక్కలు నాటారు. చిట్యాలలో శ్రీరామ్ ప్రభాత్ ఆధ్వర్యంలో, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పెద్ది పద్మ, నమ్ముల ఆనంద్‌కుమార్, షమీం ఉన్నిసా బేగం, జ్యోతి, మానిక, జుబీదా, రమాదేవి, మాధవి, ఆసియా, కీర్తి పాల్గొన్నారు.

నకిరేకల్ మున్సిపాలిటీలో

నకిరేకల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నకిరేకల్ మున్సిపాలిటీలోని కాలంవారి కంట మినీ ట్యాంక్ బండ్‌పై గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ కమిషన్ అబ్దుల్ రషీద్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి కృష్ణమూర్తి, వార్డు కౌన్సిలర్లు కందాల భిక్షంరెడ్డి, రాచకొండ సునీల్, గాజుల సుకన్య, పోతుల సునీత రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త మొక్కను నాటి సంరక్షించాలి

కేతేపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు గురువారం కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామంలో గల శివాలయంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఒక మొక్కను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శులు కూరెళ్లి వెంకటేశ్వర్లు, ఇరుగదిండ్ల పద్మ, నాయకులు చినేని జానయ్య, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, సమ్మెట విజయలక్ష్మి, సుధాకర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలి

తిప్పర్తి: ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం తిప్పర్తిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రదీప్‌బాబు, మమత, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తిప్పర్తి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తిప్పర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి



నకిరేకల్ : మినీ ట్యాంక్‌బండ్‌పై మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత

నిండుకుండలా శాలిగౌరారం ప్రాజెక్టు

- ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులు
- ప్రస్తుతం 17.5 అడుగులకు చేరిన నీరు
- రెండు పంటలకు పూర్తిస్థాయిలో అందనున్న సాగునీరు



నీటితో కళకళలాడుతున్న శాలిగౌరారం ప్రాజెక్టు

శాలిగౌరారం: మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. మూసీనది ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతూ నేటికి 17.5 అడుగులకు చేరుకుంది. మూసీనదిలోని వరదనీటిని శాలిగౌరారం ప్రాజెక్టులోకి రాచకాల్వ ద్వారా మళ్లించేందుకు ఆయకట్టు రైతులు గత రెండు నెలలుగా వరుసగా శ్రమదానాలు చేస్తూ రాచకాల్వలో చెత్తచెదారాన్ని తొలగించారు.

5వేల ఎకరాల ఆయకట్టు..

శాలిగౌరారం ప్రాజెక్టు 1200 ఎకరాల విస్తీర్ణంలో 21 అడుగుల నీటిసామర్థ్యంతో 5వేల ఎకరాల ఆయకట్టును కలిగి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 17.5 అడుగులకు చేరుకోవడం, మూసీనది ఎగువ నుండి వరదనీరు వచ్చి చేరుతుండటంతో మరో రెండు వారాల్లో పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోనుంది. ప్రాజెక్టు పరిధిలోని శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం, రామగిరి, శాలిలింగోటం, అంబారిపేట, గురుజాల, అడ్లూరు, ఊట్కూరు, బండమీదిగూడెం గ్రామాల్లో 5వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు ద్వారా ఈ సంవత్సరం వానాకాలం, యాసంగి పంటలకు ఆయకట్టుకు సాగునీరందే అవకాశం ఉండటంతో ఆయకట్టు రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అలుగు పోస్తున్న అనుసంధాన చెరువులు

మండల కేంద్రంలోని శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చే ప్రధాన రాచకాల్వకు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాలకు చెందిన పలు చెరువులు, కుంటలు అనుసంధానమై ఉన్నాయి. రాచకాల్వ ద్వారా వస్తున్న వరదనీరు నేరుగా ఆయా చెరువుల్లోకి మొదటగా చేరడంతో ఆయా మండలాలకు చెందిన చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండి అలుగులు పోస్తున్నాయి.

రైతుల సాగునీటి కష్టాలు తీరినట్లే

శాలిగౌరారం ప్రాజెక్టు నిండుకుండలా మారడం సంతోషంగా ఉంది. ఈ సంవత్సరం రెండు పంటలకు సాగునీరందనుంది. వర్షాలు పడే రోజులు ముందే ఉండటం, ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చిచేరి అలుగులు పోయనుండటంతో ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు ఇక తీరినట్లే.

– వేముల కిరణ్‌కుమార్, రైతు, శాలిగౌరారం

పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచాలి



శాలిగౌరారం ప్రాజెక్టు నేటికి సమగ్ర అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఆయకట్టు చివరి రైతులకు ప్రాజెక్టు సాగునీరందడం అందడం లేదు. ఆయకట్టు రైతులు పంటలు సాగుచేసుకోలేక తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం శాలిగౌరారం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అభివృద్ధి పరుచాలి. అప్పుడే ప్రాజెక్టు ఆయకట్టు చివరి రైతులకు సరిపడా సాగునీరు అందుతుంది.

– చాద హితీష్‌రెడ్డి, రైతు, రామగిరి, శాలిగౌరారం మండలం

సకాలంలో నీరు విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం

శాలిగౌరారం ప్రాజెక్టు నుంచి ప్రస్తుత వానాకాలం పంటకు సకాలంలో నీటి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 17.5 అడుగుల వద్ద ఉంది. ప్రాజెక్టు మరో రెండు వారాల్లో పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటుంది. ఆయకట్టు రైతులు, స్థానిక నాయకుల సమన్వయంతో నిత్యం రాచకాల్వ వెంట పర్యవేక్షణ చేస్తున్నాం.

– సత్యనారాయణ, ఇరిగేషన్ డీఈఈ, శాలిగౌరారం ప్రాజెక్టు